క్లుప్తంగా

వేగేశ్వరపురంలో శ్రీరామ పట్టాభిషేకం



వేగేశ్వరపురంలో సీతారాములకు 108 ప్రసాదాల నివేదన

తాళ్లపూడి: వేగేశ్వరపురంలోని పట్టాభిషేక సీతారామాలయంలో శనివారం రాత్రి శ్రీరామ పట్టాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. టీటీడీ ధర్మ ప్రచారకుడు వరద రాధాకృష్ణ ఆధ్వర్యంలో మహిళలు 108 ప్రసాదాలను సీతారాములకు నివేదించారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి ఒక్కొక్కరు ఒక్కో ప్రసాదాన్ని తయారు చేసి తీసుకు వచ్చి నివేదించారు. శ్రీరామ పట్టాభిషేక వేడుకలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఘనంగా రాజగోపాలస్వామి కల్యాణం



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, పార్టీ శ్రేణులు

నిడదవోలు రూరల్: డిముక్కల గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామివారి కల్యాణాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్వామివారిని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ పర్యవేక్షణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఎంపీపీ తిరుమల భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు ఐయినీడి పల్లారావు, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల నాగేశ్వరరావు, కౌన్సిలర్ కొత్తపల్లి సుప్రియ, పార్టీ నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నవరప్పాడుకు పోటెత్తిన భక్తులు



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకుడు

పెరవలి: శనివారం కావడంతో అన్నవరప్పాడులోని వేంకటేశ్వరస్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు అనంతరం స్వామి, అమ్మవార్ల దర్శనానికి తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి భక్తులకు అనుమతించారు. ఉదయం 7 గంటలకు భక్తులకు మొదలైన భక్తుల రద్దీ మధ్యాహ్నం 1 గంట వరకూ కొనసాగింది. దూరప్రాంత భక్తుల సౌకర్యార్థం మధ్యాహ్నం ఉచిత భోజన వసతి కల్పించారు. దర్శనం చేసుకున్న భక్తులకు పులిహోర పంపిణీ చేస్తున్నామని ఆలయ ఈఓ శ్రీనివాస్ చెప్పారు. దాతల సహకారంతో ఇవన్నీ జరుగుతున్నాయని చెప్పారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి



గోపాలపురంలో విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న మానవత సంస్థ సభ్యులు

గోపాలపురం: స్థానిక జెడ్పీ హైస్కూల్ టెన్త్ విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సంస్థ మండలశాఖ సభ్యులు శనివారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. సోమవారం నుంచి ప్రారంభం అయ్యే టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని మానవత సంస్థ సభ్యులు కొన్నింటాగడ్డ రాంబాబు, కూనం రామమోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు బూరెడ్డి వాసు, ఉపాధ్యక్షుడు ముప్పన కృపావరప్రసాద్, విద్యాకమిటీ చైర్మన్ వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర కల్యాణం

కొవ్వూరు: కుమారదేవంలో కొలువైన అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆ గ్రామానికి చెందిన ఎర్రిపోతల పథకం రైతుసంఘం అధ్యక్షుడు గోలి శ్రీనివాస్, దుర్గా సుజాత దంపతుల చేతుల మీదుగా ఈ వేడుక జరిగింది. అనంతరం హోమం నిర్వహించారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆలయానికి తెలుగు ఆలయానికి వచ్చి స్వామి వారిని, అనంతరం రాజరాజేశ్వరీ సమేత భోగేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. వేద పండితులు ప్రజాప్రతినిధులు ఇద్దరికీ పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలు అందించారు. జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పది పరీక్షలు

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- పరీక్ష కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు
- ఈ నెల 3 నుంచి 18 వరకూ నిర్వహణ



చాగల్లు మండలం ఊనగట్ల పరీక్ష కేంద్రంలో విద్యార్థుల హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయుడు

చాగల్లు: ఈనెల 3 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. చాగల్లు మండలంలో 7 ప్రభుత్వ, మరో 7 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఈ ఏడాది ఆయా స్కూళ్ల నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలకు 577 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. వారిలో 301 మంది బాలురు, 276 మంది బాలికలు. ప్రతి పరీక్ష కేంద్రంలోను చీఫ్, డిపార్ట్‌మెంటల్ అధికారితో పాటు 30 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహిస్తారు. పరీక్ష కేంద్రాల్లో మంచినీరు, విద్యుత్, టేబుల్స్, విద్యార్థుల కోసం వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

పరీక్ష కేంద్రాలివే..

పది పరీక్షల కోసం చాగల్లు మండలంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. చాగల్లు జెడ్పీ హైస్కూల్ కేంద్రంలో 177 మంది పరీక్షలు రాస్తారు. ఊనగట్ల జెడ్పీ హైస్కూల్ కేంద్రంలో 168 మంది, మార్కొండపాడు జెడ్పీ హైస్కూల్ కేంద్రంలో 150 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారు. మిగిలిన విద్యార్థులు నిడదవోలు పట్టణంలోని, నిడదవోలు మండలం తాడిమళ్ల పరీక్ష కేంద్రంలో పరీక్షలకు హాజరవుతారు. మండలంలో 7 జెడ్పీ హైస్కూళ్లున్నాయి. చాగల్లు హైస్కూల్ నుంచి 180, ఊనగట్ల హైస్కూల్ నుంచి 74, బ్రాహ్మణగూడెం హైస్కూల్ నుంచి 62, మల్లవరం హైస్కూల్ నుంచి 31, మార్కొండపాడు హైస్కూల్ నుంచి 65, కలవలపల్లి హైస్కూల్ నుంచి 18, చిక్కాల హైస్కూల్ నుంచి 47 మంది పరీక్షలకు హాజరవుతున్నారు.

ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

టెన్త్ పరీక్షలు ఏప్రిల్ 3న ప్రారంభమై, 18న ముగుస్తాయి. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని విద్యాశాఖాధికారులు సూచిస్తున్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. పరీక్షలు రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ జరుగుతాయి. విద్యార్థుల వెంట హాల్‌టికెట్టు, పరీక్ష సామగ్రి అయిన పెన్నులు, పెన్సిల్ వంటి వస్తువులను లోపలికి అనుమతిస్తారు.



నల్లజర్లలో టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు

నల్లజర్ల మండలంలో..

నల్లజర్ల: మండలంలో 630 మంది ప్రభుత్వ, 460 ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనున్నారు. వారి కోసం నల్లజర్లలోని శశి, భాష్యం, సెయింట్ క్లారెట్స్ స్కూళ్లు, నల్లజర్ల, దూబచర్ల, పోతవరం జెడ్పీ హైస్కూళ్లను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశారు. అలాగే 64 మంది ఇన్విజిలేటర్లను, 12 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను, ఇద్దరు రూట్ ఆఫీసర్లను నియమించారు. ప్రశ్నాపత్రాలు నల్లజర్ల పోలీస్ స్టేషన్‌లోని కస్టడీలో భద్రపరిచారు. మండలంలోని అన్ని పరీక్ష కేంద్రాలను ఇప్పటికే ఎంఈఓ జి.శ్రీనివాసరావు సందర్శించారు. ఆయా కేంద్రాల్లో విద్యుత్, ఫర్నిచర్లు, తాగునీరు, టాయిలెట్లు వంటి అంశాలను పరిశీలించారు. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, 15 నిమిషాల ముందుగానే ఇన్విజిలేటర్లు వివరాలు నమోదు చేసుకుంటారన్నారు. హాల్ టికెట్లు ప్రధానోపాధ్యాయుల వద్ద ఉంటాయన్నారు. లేకుంటే నెట్ సెంటర్ నుంచి కూడా తీసుకోవచ్చన్నారు. అయితే వాటిపై ప్రధానోపాధ్యాయుల సంతకం చేయించాలన్నారు. హాల్ టిక్కెట్లను ఒక రోజు ముందుగానే విద్యార్థుల తల్లిదండ్రులు పరిశీలించుకోవాలని సూచించారు.



"అర గంట ముందుగా రావాలి

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టెన్త్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నాం. ఆరోగ్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచాం. పరీక్ష కేంద్రానికి అరగంట ముందుగానే వచ్చి విద్యార్థులు తమకు కేటాయించిన గదులను చూసుకోవాలి. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది."

– వి.భాస్కర్‌బాబు, ఎంఈఓ, చాగల్లు మండలం

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నిడదవోలు రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ఎంపీడీఓ టి.మూర్తిబాబు శనివారం తెలిపారు. అట్లపాడు (బీసీ–డీ), డి.ముప్పవరం (ఎస్సీ), గోపవరం (ఎస్సీ), కాటకోటేశ్వరం (ఎస్సీ–మహిళ), మునిపల్లి (ఎస్సీ–మహిళ), సమిశ్రగూడెం (బీసీ), సింగవరం (బీసీ–డీ), తాడిమళ్ల (జనరల్) స్థానాల్లో వలంటీర్ల భర్తీ చేస్తామన్నారు. ఈనెల 4లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ మూర్తిబాబు సూచించారు.

గృహ సారథుల మండల కన్వీనర్‌గా వెంకట సతీష్



కుసులూరి వెంకటసతీష్

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గృహ సారథుల దేవరపల్లి మండల కన్వీనర్‌గా త్యాజంపూడి పంచాయతీ ఉప సర్పంచ్, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ కుసులూరి వెంకట సతీష్‌ను నియమించారు. ఈ మేరకు శనివారం దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు వెంకట సతీష్‌ను ప్రకటించారు. సోషల్ మీడియా కన్వీనర్‌తో పాటు గృహసారథుల మండల కన్వీనర్ బాధ్యతలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

సీఎం జగన్ మహిళా పక్షపాతి



తాళ్లపూడిలో ఆసరా చెక్కు అందిస్తున్న మంత్రి వనిత, ఎంపీ భరత్‌రామ్



తాళ్లపూడిలో వైఎస్సార్ ఆసరా చెక్కును మహిళలకు అందిస్తూ, జై జగన్ అంటూ నినదిస్తున్న రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, మహిళలు

- హోం మంత్రి తానేటి వనిత
- ఎంపీ మార్గాని భరత్‌తో కలిసి వైఎస్సార్ ఆసరా చెక్కుల అందజేత

తాళ్లపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని, వారి అభ్యున్నతికి ఆయన ఇస్తున్నంత ప్రాధాన్యం, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలోనూ అమలు జరగడం లేదని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత కింద మండలంలోని 1,117 డ్వాక్రా గ్రూపులకు రూ.10.87 కోట్ల మొత్తం విడుదలైంది. దీనికి సంబంధించిన చెక్కును మంత్రి వనిత, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ తాళ్లపూడిలో శనివారం మహిళలకు అందజేశారు. అనంతరం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మహిళా మండ్రులో మెప్మా హోంమంత్రి పాటో దిగారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళలంటే ఎనలేని గౌరవమని అన్నారు. వారి ఆర్థిక, రాజకీయ స్వావలంబన కోసం వివిధ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. దేశంలోని 28 రాష్ట్రాల్లో తాను మాత్రమే మహిళా హోం మంత్రిగా ఉన్నానని, మహిళలకు సీఎం జగన్ ఇస్తున్న గౌరవమని అన్నారు. పేదల కోసం పని చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి ఆశీర్వదించాలని మంత్రి వనిత కోరారు.

ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మహిళలను మోసం చేసిందని గుర్తు చేశారు. దీనికి భిన్నంగా ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా ఆర్థిక పరిస్థితిని మార్చడానికి వివిధ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఎంపీపీ కొన్నకూరు పోశిరాజు, ఏఎంసీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ ఎస్.సుభాషిణి, ఏపీఎం రోజ్ మాణిక్యం, ఎంపీడీఓ ఎం.రాజశేఖర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

సబ్సిడీపై రైతు గ్రూపులకు యంత్ర పరికరాలు

కొవ్వూరు: రైతులు సాగు ఖర్చులను తగ్గించుకునేందుకు వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై వివిధ రకాల యంత్ర పరికరాలను అందిస్తోందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. చాగల్లు మండలం నెలటూరుకు చెందిన రైతులకు మంజూరైన ట్రాక్టర్, వివిధ రకాల యంత్ర పరికరాలను మంత్రి శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఆ గ్రామానికి చెందిన వినాయక సీహెచ్‌సీ గ్రూపు రైతు మిత్ర గ్రూపునకు రూ.14,89,186 విలువైన యంత్ర పరికరాలను అందజేశారు. ఒక ట్రాక్టర్, బుల్ రోటోవేటర్, చాఫ్ కట్టర్స్, 12 ప్లేట్ డిస్క్ హారో, తొమ్మిది టైన్ కల్టివేటర్లను సంఘ రైతులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రూపు కన్వీనర్ నిడదవోలు రామకృష్ణ, కో-కన్వీనర్ తాళ్లూరి వీరవేదామోదరం, గెడా శ్యామ్‌సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛనుగా సొంత సొమ్ములు

లబ్ధిదారులు ఇబ్బంది పడకూడదని ముందుకొచ్చిన వలంటీర్



మల్లేశ్వరంలో వృద్ధులకు పింఛనుగా సొంత సొమ్ము ఇస్తున్న వలంటీర్ నేదునూరి విష్ణు

పెరవలి: బ్యాంకులకు వరుసగా రెండు రోజులు సెలవు రావడంతో ఈ నెల 3న లబ్ధిదారులకు సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ పరిధిలోని లబ్ధిదారులు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో మండలంలోని మల్లేశ్వరానికి చెందిన వలంటీర్ నేదునూరి విష్ణు తన సొంత సొమ్ములతో 1వ తేదీనే పింఛన్లు అందించారు. ఆతడి పరిధిలో 28 మంది లబ్ధిదారులుండగా వీరిలో ఐదుగురు దివ్యాంగులు, మిగిలిన వారు వృద్ధులు. దివ్యాంగులకు ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున రూ.15 వేలు, మిగిలిన 23 మందికి ఒక్కొక్కరికి రూ.2,750 చొప్పున మొత్తం రూ.78,500 ఇచ్చారు. ఈ మొత్తాన్ని తరువాత ప్రభుత్వం అందజేసే సొమ్ము నుంచి సర్దుబాటు చేసుకుంటారు. వలంటీర్‌గా ఇలా సహాయం చేయడాన్ని అందరూ అభినందిస్తున్నారు. అతడు 2021 జనవరిలో కూడా ఇలాగే సొంత సొమ్ములు పింఛనుగా ఇచ్చాడని పలువురు లబ్ధిదారులు చెప్పారు. విష్ణును నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు, పెరవలి ఎంపీపీ కార్ల ప్రసాద్, సర్పంచ్ బొలిశెట్టి రత్నమాల పట్టాభి తదితరులు అభినందించారు.

సంక్షేమ పాలనను ఆశీర్వదించండి

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- కుమారదేవంలో కొనసాగిన గడప గడపకూ..



కుమారదేవంలో ఓ గృహిణికి చేకూరిన లబ్ధిని వివరిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ప్రజలు అండగా నిలవాలని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత కోరారు. మండలంలోని కుమారదేవంలో రెండో రోజు శనివారం కూడా ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటికి పరిష్కార మార్గాలు చూపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన మేలును వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, పార్టీ మండల శాఖ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు సుంకర సత్యనారాయణ, గన్నమని వెంకటరాజు, పార్టీ నాయకులు కాసాని దుర్గారావు, ఆడబాల దుర్గారావు, ఉప సర్పంచ్ గెడ్డం రామకృష్ణ, కుమారదేవం ఎత్తిపోతల పథకం రైతు సంఘం అధ్యక్షుడు గోలి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు పామెర్ల నగేష్, ముదునూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు ప్రత్యేక ఏర్పాట్లు



నిడదవోలు కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ గంగరాజు, ఎంఈఓ కిషోర్

నిడదవోలు రూరల్: ప్రశాంత వాతావరణంలో టెన్త్ విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఎంఈఓ డి.కిషోర్‌కుమార్ చెప్పారు. నిడదవోలు జెడ్పీ బాలికోన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని ఎంఈఓ కిషోర్, తహసీల్దార్ ఎం.గంగరాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కిషోర్ మాట్లాడుతూ టెన్త్ పరీక్షలకు మండలంలోని 9 పరీక్ష కేంద్రాల ద్వారా 1,538 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు.79 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌తో వచ్చేందుకు అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రాలకు వచ్చే విద్యార్థులంతా హాల్‌టికెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. పాఠశాల హెచ్‌ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం మండలం నుంచి 1090 మంది..

ఉండ్రాజవరం: మండలం నుంచి 1090 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరవుతున్నట్టు ఎంఈఓ పీవీఎస్‌నాగరాజు తెలిపారు. మండలంలో 8 ఉన్నత పాఠశాలలు, 3 ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయన్నారు. మండలంలో 5 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల–ఎ సెంటర్‌లో 250 మంది, ఉండ్రాజవరం–బి సెంటర్‌లో 240 మంది, వేలివెన్ను ఉన్నత పాఠశాలలో 140 మంది, వేలివెన్ను అన్నపూర్ణలో 220 మంది, వేలివెన్ను శశిలో 240 మంది టెన్త్ పరీక్షలు రాస్తారన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

చలో ఢిల్లీపై సీఐటీయూ కరపత్రాల పంపిణీ

కొవ్వూరు: కార్మికులు, కర్షకులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్ల సమస్యల సాధనకు ఈనెల 5న తలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు కోరారు. ఈ మేరకు సీఐటీయూ ప్రతినిధులు శనివారం పట్టణంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక నిత్యావసరాల ధరలను విపరీతంగా పెంచిందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిర్మాణ రంగంలో కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను అమలు చేయాలని కోరారు. స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధం చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. మద్దుకూరి దొరయ్య, మానికిరెడ్డి హరిబాబు, బి.భద్రం, కె.చిన్నా, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దొండపూడి బస్సు సర్వీసు పునరుద్ధరణ



దొండపూడిలో ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: దొండపూడి గ్రామం నుంచి రాజమహేంద్రవరానికి ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించారు. ఈ సర్వీసును శనివారం దొండపూడిలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. దొండపూడిలో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా చెక్ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. తమ గ్రామం నుంచి గతంలో రాజమహేంద్రవరానికి నడిచిన ఆర్టీసీ బస్సు సర్వీసు రద్దవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని ఆ గ్రామస్తులు ఆయనకు వివరించారు. ఆ సర్వీసును పునరుద్ధరించే ఏర్పాటు చేయాలని వారు కోరారు. దాంతో ఎమ్మెల్యే వెంకట్రావు అక్కడి నుంచే ఆర్టీసీ రాజమహేంద్రవరం రీజనల్ మేనేజర్‌తో మాట్లాడారు. ఆర్‌ఎం కూడా సానుకూలంగా స్పందించడంతో మరుసటి రోజు నుంచే బస్సు సర్వీసు మొదలైంది. ఈ బస్సు సర్వీసు దొండపూడి నుంచి గ్రామ దిపల్లి, గోపవరం, హుకుంపేట, భీమోలు, తాళ్లపూడి, కొవ్వూరు మీదుగా రాజమహేంద్రవరం వెళుతుంది. బస్సు ఏర్పాటుతో ఆయా గ్రామాల ప్రయాణికులు ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు పోతిరెడ్డి నాగరాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు యండపల్లి కవిత, మండల యూత్ అధ్యక్షుడు కాసాని సతీష్ కుమార్ (నాని) సర్పంచులు యండపల్లి శేఖర్‌బాబు, మల్లిపూడి అచ్చిబాబు, ఎంపీటీసీ సభ్యుడు మారాబు రాజేష్,వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్' సక్సెస్ చేయండి

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజాభిప్రాయ సేకరణకు చేపట్టిన 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కోరారు. ఈ నెల 7 నుంచి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం వైఎస్సార్ సీపీ మండల శాఖల అధ్యక్షులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల మండల కన్వీనర్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమీక్ష జరిపారు. ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి వారం రోజుల పాటు గృహ సారథులు తమకు కేటాయించిన 50 గృహాలను సందర్శించి నాలుగేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు వంటి విషయాలను నమోదు చేయాలన్నారు. ఐదుకు సచివాలయ కన్వీనర్లు, పార్టీ మండల కన్వీనర్లు సహకారాన్ని తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామ సచివాలయంలో కన్వీనర్ అధ్యర్యంలో సమావేశం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాలుగు మండలాల అధ్యక్షులు కానుపూడి సతీష్, నాగరాజు, గగ్గర శ్రీనివాస్, ప్రతాపనేని వాసుబాబు, జెడ్పీటీసీ సభ్యులు పాట్టి నర్మద లత, చిగురుపల్లి సామ్యూల్, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, పార్టీ నేతలు ఆచంట అనసూయ, కారుమంచి రమేష్, బంకా అప్పారావు, ఎస్‌కే వలీ, మేడిబోయిన గంగరాజు పాల్గొన్నారు.

కూలీకి పాముకాటు



ప్రత్తిపాటి బాబూరావు

గోపాలపురం: మండలంలోని వాదాలకుంటకు చెందిన ప్రత్తిపాటి బాబూరావు అనే కూలీ పాముకాటుకు గురయ్యాడు. అతడు శనివారం మండలంలోని కరిచర్లగూడెంలో పాగాకు తోటలో ఆకు రెలుపుల పనికి వెళ్లాడు. ఆకులు రెలుపుతుండగా బాబూరావును త్రాచుపాము కరిచినట్లు తోటి కూలీలు చెప్పారు. బాబూరావును గోపాలపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకు వచ్చారు. అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ఇక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ఆసుపత్రికి రిఫర్ చేసినట్టు డాక్టర్ ఎం.శోభారాణి తెలిపారు.

బీఎస్పీ నాయకుల ధర్నా

ఉండ్రాజవరం: బహుజన సమాజ్ పార్టీ నాయకులు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కోనసీమ జిల్లాకు బీఆర్ అంబేడ్కర్ అనే పేరు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ గతేడాది అమలాపురంలో విధ్వంసం సృష్టించిన వారిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ వారి ధర్నా చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ జి.కనకరాజుకు వినతిపత్రం అందజేశారు. బీఎస్పీ నాయకులు దొల్లా జాషువా, మద్ది మహాలక్ష్మి, బత్తిన ఆశీర్వాదం పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

నిడదవోలు రూరల్: దాడి ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సమిశ్రగూడెం ఎస్సై పి.సుభాని శనివారం తెలిపారు. మండలంలోని పెండ్యాలకు చెందిన దేవన టేకూరి సుభాష్‌చంద్రబోస్ అనే వ్యక్తికి చెందిన అరటితోటలోకి అదే గ్రామానికి చెందిన అడిగెం సురేష్ మార్చి 28న అక్రమంగా ప్రవేశించి అరటి చెట్లను ధ్వంసం చేస్తున్నాడన్నారు. తన అరటి తోట ధ్వంసం ఎందుకు చేస్తున్నావని అడిగిన తనపై సురేష్ దాడి చేశాడని బాధితుడు సుభాష్ చంద్రబోస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.